12వ పాఠం సెప్టెంబరు 12-18

# అబద్ధ బోధకులతో వ్యవహరించుట

**సబ్బాతు మధ్యాహ్నము** **సెప్టెంబరు 12**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : 2కొరింథి 10:1-17; యిర్మీయా 9:24; 2కొరింథిజ 11:1-15; 22-28; 2కొరింథి 12:20,21; 2కొరింథి 13:5.**

**కంఠతవచనం : "మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కావు గాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయ జాలినంత బలముకలవై యున్నవి" (2కొరింథి 10:4).**

పౌలుకు అప్పటికే తగినన్ని సమస్యలు లేనట్లు మరొక సమస్య ఎదురైనది. దానిని ఇప్పుడు ఆయన పరిష్కరించవలసి వచ్చెను. సంఘములో అబద్ధ బోధకులు ప్రత్యక్షమయ్యారు. ఈ అబద్ధ బోధకులు పౌలును, ఆయన పనిని, సువార్త సేవను వ్యతిరేకిస్తున్నారు. అన్నిటికన్న ఘోరమైన విషయమేమిటంటే ఈ అబద్ధ బోధకులు కొరింథులోఉన్న క్రైస్తవ సభ్యులను కూడా మోసం చేయుచున్నారు. వారికి వ్యతిరేకముగా పౌలు చేయుచున్న ఆ పోరాటమును ఆత్మ సంబంధమైన యుద్ధముగా పేర్కొనెను.

పౌలు ఎదుర్కొనిన సమస్యను అతిశయోక్తిగా చెప్పియున్నాడా? కానేకాదు. అంతిమముగా అబద్ధ బోధకులు తనను వ్యతిరేకించుట కాదు గాని క్రీస్తునే వారు వ్యతిరేకించుచున్నట్లు పౌలుకు తెలుసు. తన క్రింద పనిచేసే వారి మీద అధికారమును, పెత్తనమును చెలాయించుచు తనను తాను పొగడుకొనే తత్వము కలిగిన నాయకుని వంటివాడు పౌలు కాదు. ఆయన బోధించే సువార్త జీవమునకు మరణమునకు సంబంధించి శాశ్వత ఫలితమును ఇచ్చే వర్తమానమని కూడా పౌలుకు తెలుసు. దేవుడే స్వయముగా తనను పిలిచి ఆ వర్తమానమును ప్రకటించమని పంపించెనని కూడా పౌలుకు తెలుసు. దేవుని చిత్తము వలన యేసు క్రీస్తు యొక్క అపొస్తలుడుగా పౌలు పిలువబడెను (1కొరింథి 1:1).

అబద్ధ బోధల విషయానికి వస్తే సంఘము ప్రేమతో వ్యవహరించాలి గాని, పరిశుద్ధ లేఖనాలకున్న అధికారమును ఆధారము చేసుకొని స్థిరముగాను, నిలకడగాను ఉండాలి. సువార్త వర్తమానము ఆత్మలకు శాశ్వత నిరీక్షణను అనుగ్రహించుటకు స్వచ్ఛమైనదిగాను చెడిపోనటువంటి విధముగాను సంరక్షించబడాలి.

సెప్టెంబరు 19, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును చదువుటకు సిద్ధపడుడి.

ఆదివారం సెప్టెంబరు 13

## ఆత్మ సంబంధమైన యుద్ధము

**2కొరింథి 10:1-11 చదువుడి. కొరింథీయులతో పౌలు వ్యవహరించినపుడు చూపించిన వినయమును గూర్చి కొన్నిసార్లు వారు కంగారు పడి అది పౌలు యొక్క బలహీనతగా భావించారు. కొరింథులో ఉన్న అబద్ధ బోధకుల విషయములో ఆయన వారితో వ్యవహరించినపుడు పౌలు చూపిన ధైర్యమును గూర్చి మనము చదివిన ఈ వాక్యములలోని ఏ మాటలు బయలుపరచుచున్నవి?**

2 కొరింథి 10 ని పౌలు వ్యక్తిగతమైన విషయముగా ఆరంభించెను 'పౌలను నేను మిమ్ములను వ్యక్తిగతముగా వేడుకొనుచున్నాను' (2కొరింథి 10:1) దీనిని బట్టి అబద్ధ బోధనలు క్రైస్తవ సంఘములోనికి చొచ్చుకొని వచ్చుచుండగా వాటి విషయమై ఎంత ఆందోళన చెందాడో మనకు కనిపిస్తుంది. 2కొరింథి 10:1లోని తన మాటలు నిందాస్తుతిగా ఉన్నప్పటికి, దూరమునుండి ఆయన పత్రికలను వ్రాసినపుడు, చాలా కఠినముగాను భయపెట్టే విధముగా వ్రాసేవాడు. అయితే ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడేటప్పుడు చాలా నమ్రతగా వ్యవహరించేవాడు (2కొరింథి 10:10,11) ఆయనను గూర్చి బలహీనత అని భావించిన విషయములో పౌలు అది బలహీనతగా భావించకుండా ఆ విషయములో క్రీస్తును పోలిన శక్తివంతమైన నమ్రతతో కూడిన సున్నితమైన విధానమును అనుసరించెను.

అబద్ధ బోధకులను ధైర్యముగాను, ఆత్మ విశ్వాసముతోను ఎదుర్కొనాలి (2కొరింథి 10:2) అదే సమయములో క్రీస్తును పోలిన సున్నితమైన విధానమును అనుసరించెను (2కొరింథి 10:1) యేసు ఒకసారి ఈవిధముగా పలికెను, "నేను సాత్వీకుడను, దీనమనస్సు గల వాడను" (మత్తయి 11:29). అయితే యేసు చాలా ధైర్య సాహసములతో దేవాలయము యొద్ద రూకలను మార్చు వారిని దొంగల గుహగా చేసితిరని వారిని వెళ్ళగొట్టెను (మత్తయి 21:12,13) యేసు ఒకసారి పరిసయ్యులను వేషధారులని పిలిచెను. తరువాత వారిని సున్నము కొట్టిన సమాధులని పిలిచెను (మత్తయి 23:23-27). యేసువలె పౌలుకు కూడా తెలుసు. మనము ఆత్మ సంబంధమైన యుద్ధమును చేయుచున్నాము గనుక దేవుని యొక్క సంపూర్ణ కవచము అవసరమైయున్నదని (ఎఫెసి 6:12-17).

2 కొరింథీ 10లోని పౌలు యొక్క భాష యుద్ధ భూమికి సంబంధించిన మాటలను అనుసరించెను. ఏలయనగా ఇక్కడ జీవితాలు ప్రాణాపాయములో ఉన్నవి. (2కొరింథి 10:3-6) ఇది కేవలం మానవుల మధ్య జరుగుచున్న యుద్ధము మాత్రము కాదు గాని, ఇది క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించే దైవ సంబంధమైన యుద్ధము. ప్రతి అబద్ధపు వాదనలు ఉన్నతమైన అభిప్రాయాలనుతప్పనిసరిగా ఎదుర్కొనవలసియున్నది. వాటిని నాశనము చేయాలి. ఇవన్నియు దేవుని వాక్యముతో పోరాడవలసియున్నది. క్రీస్తుకు విధేయులుగా చేయుట కొరకు (2కొరింథి 10:5).

ఈ ఆత్మ సంబంధమైన యుద్ధ భూమిలో పౌలు క్రీస్తు యొక్క అధికారంలో పనిచేసాడు. ఈ అధికారమును పడద్రోయుటకు కాక కట్టుటకే ఉపయోగించిరి. (2కొరింథి 10:8) దేవుని అధికారముతో పనిచేయున్నామని ఆత్మ సంబంధమైన నాయకులు చాలా సులభంగా చెప్పెదరు. ఒక విషయము గుర్తుంచుకోండి. అధికారము క్రీస్తు ఇవ్వాలి. నాయకులు నమ్రతతో ప్రవర్తించాలి. కొరింథీయులు అబద్ధ బోధకుల మాటలను విని క్రీస్తుకు వినయము చూపించనందున పౌలు అతనికి క్రీస్తు ఇచ్చిన అధికారముతో ఎదుర్కొని యున్నాడు.

**అబద్ధ బోధకులతో వ్యవహరించేనపుడు ఒకేసారి నమ్రతతోను మరియు ధైర్యముగా ఎట్లుండగలము? ఈ రెండు విషయాలను ఎందుకు కలిగియుండాలి?**

**సోమవారం** **సెప్టెంబరు 14**

## ప్రభువు నందు అతిశయించుట

నిన్నటిదినాన పౌలు మరియు తన తోటి పనివారు చేయుచున్న సేవ ఒక ఆత్మ సంబంధమైన యుద్ధమనియు, ఆ యుద్ధములో దేవుని ఆయుధాలను ఉపయోగించుచున్నారని చెప్పిరి. ఈ దినమున మనము అబద్ధ బోధకులు మానవ సంబంధమైన ప్రమాణాలను పాటిస్తూ, వాటి ప్రకారము అబద్ధ బోధనలు చేస్తూ వాటికి తగని రీతిలో అతిశయించుచున్నారు. అయితే పౌలు మాత్రము ప్రభువునందే అతిశయించెను. ఆయన ఈ విధంగా వ్రాసెను "అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను" (2కొరింథి 10:17)

**2కొరింథి 10:13-17 చదువుడి. పోటీ తత్వముతో కూడిన వాతావరణము సువార్త ప్రచారమునకు హాని ఏవిధంగా చేయును?**

పౌలు స్వీయ అహంభావముతో మాట్లాడిన విధానమును, ఉపయోగించిన భాషను గూర్చి శతాబ్దముల తరబడి వివరణకర్తలు కొంచెము చమత్కారముగా ఉన్నట్లు భావించారు. అయితే ఆ విధమైన స్వీయ అహంభావము సమాజములో ఉన్న కట్టుబాట్ల గురించి పౌలుకు తెలుసు కాబట్టి వాటిని అనుసరించాడు. పౌలు అనుసరించిన విధానమునకు అబద్ధ బోధకులు అనుసరించిన విధానమునకు చాలా తేడా ఉన్నది. పౌలు ప్రభువు నందు అతిశయించెను. (2కొరింథి 10:17) ఇది పాతనిబంధన నుండి తీసుకొనబడిన వాక్యములు "అతిశయించువాడు దేనినిబట్టి అతిశయింపవలెననగా భూమి మీద కృప చూపుచు నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలుసుకొనుటను బట్టి అతిశయింపవలెను. అట్టి వాటిలో నేనానందించువాడనని ప్రభువును సెలవిచ్చుచున్నాడు" (యిర్మియా 9:24) యిర్మియా గ్రంథమునుండి పౌలు ఈ వాక్యములను ఎంచుకొని క్రీస్తును కేంద్రముగా చేసుకొని ఆయన లక్షణములైన ప్రేమ, న్యాయం మరియు నీతియందు పౌలు అతిశయించెను.

వేరొక మాటలో చెప్పాలంటే క్రీస్తునందు దేవుడు వేటినైతే సాధ్యము చేసాడో వాటిని గూర్చి పౌలు అతిశయించాడు. అందుచేతనే పౌలు యొక్క అతిశయము బైబిలుకు సంబంధించినందున ఎవరిని అభ్యంతర పెట్టలేదు. అబద్ధ బోధకులైతే వారిని ఒకరితోఒకరు

పోల్చుకొని పోటీతత్వమును సృష్టించారు. తమ్మును తామే మెచ్చుకొనిరి. ఇది అవివేకము. (2కొరింథి 10:12)

2కొరింథి 10:14-16లో కొరింథులోను, చుట్టు ప్రక్కలున్న ప్రాంతములలో సువార్తను బోధించుటయే తన ప్రథమ కర్తవ్యమని పౌలు తన పనిని గూర్చి వివరించాడు. పౌలు క్రీస్తును ప్రేమిస్తున్నాడు గనుక, క్రీస్తు యొక్క మరణ, పునరుత్తానములో ఉన్న రక్షణ సువార్తను నిత్యము క్రటించాలనే అభిలాష అతనికి కలిగెను.

అబద్ధ బోధకులు తమను తామే మెచ్చుకొనుచు కొరింథులో ప్రచారము చేసుకొనుచున్నారు. పౌలు మాత్రము దేవుని చేత మెప్పు పొందినవాడై ఆయన అంగీకరించిన వర్తమానమును ప్రకటించాడు. (2కొరింథి 10:12,18) దేవుని చిత్తము ప్రకారము పౌలు క్రీస్తు యొక్క అపొస్తలుడుగా పిలువబడెను (1కొరింథి 1:1) పౌలు తన జీవితాంతము తాము పిలువబడిన పనిలో విశ్వాసపాత్రుడుగా ఉండెను (2తిమోతి 4:7).

**2కొరింథి 10:12-18 చదువుడి. క్రైస్తవ సంఘ నాయకులు పోటీతత్వమును ప్రోత్సహించకుండా ఏవిధముగా ఉండగలరు. అట్టి వాటికి స్థానము లేకపోయినను ఎందుకు అటువంటి వాతావరణములో సులువుగా చిక్కుకుంటారు?**

**మంగళవారం** **సెప్టెంబరు 15**

## అబద్ధ బోధకులు గుర్తింపబడిరి

క్రైస్తవ సమాజములలో అనేకమంది అబద్ధ బోధకులు ఉండుట వలన వారికి వ్యతిరేకముగా అనేక హెచ్చరికలను ఇచ్చుట నూతన నిబంధనలో కన్పిస్తున్నాయి. ఇదే విషయమును గూర్చి జాగ్రత్తగా ఉండమని యేసు తన శిష్యులను హెచ్చరించెను. (మత్తయి 7:15-20) అపొస్తలులు కూడా ఈ విషయమై హెచ్చరించడం జరిగింది (గలతీ 1:6-9; 1తిమోతి 6:3-5; 2పేతురు 2:1-3).

**2కొరింథి 11:1-15 చదువుడి. అబద్ధ బోధకులనుండిఎదురైన సమస్యలను గూర్చి పౌలు ఏవిధముగా వర్ణించెను?**

అబద్ధ బోధకులు చేయుచున్న పనులను పౌలు అందరికి తేటతెల్లము చేసెను. అదే సమయములో క్రీస్తు కేంద్రముగా పౌలు తన సేవను నిర్వహించాడు. కొరింథులో క్రైస్తవ సంఘమును ఒక పెండ్లి కుమార్తెకు పోల్చి తాను ఆమెకు తండ్రిగా ఎంచుకొని ఆమెను క్రీస్తుకు అప్పగించాలనే బాధ్యతను తీసుకున్నాడు (2కొరింథి 11:2). పౌలు కొరింథీలలో ఉన్న క్రైస్తవ సంఘమును ప్రేమించినందున ఆయన ఆవిధముగా బాధ్యతను స్వీకరించెను (2కొరింథి 11:11). అందుచేత సంఘమునకు ఆర్ధికముగా భారముగా ఉండకూడదని నిశ్చయించుకొనెను. సంఘమునకు కాపరిగా ఆయనను పోషించవలసిన బాధ్యత ఆ సంఘానికి ఉన్నప్పటికి తాను స్వతంత్రముగా జీవించాడు ( 2కొరింథి 11:7-12).

ఇంకొక ప్రక్క చూస్తే చాలా ప్రసిద్ధి చెందిన అపొస్తలులు (పరిహాసముగా అబద్ధ బోధకులనుద్దేశించి చెప్పబడినది) హవ్వను మోసపుచ్చిన సర్పముతో పోల్చబడిరి (2కొరింథి 11:3). ఏదెను వనములో సాతానువలె కొరింథు పట్టణములో అబద్ధ బోధకులు అవినీతికి పాల్పడటం, మోసము చేయుచుండిరి (2కొరింథి 11:3,4) కొరింథు సంఘ సభ్యులు క్రీస్తుకు చూపించే భక్తి వినయములు, నమ్మకమైన ఆరాధన నుండి వారు ఎక్కడ మార్చబడి, భ్రష్టత్వములోకి నడిపింపబడుదురనే ఆందోళన పౌలును వేధిస్తుంది.

ఆ విధంగా క్రైస్తవ సంఘములోనికి చొచ్చుకు వచ్చిన అబద్ద బోధకులు పౌలు బోధించే వర్తమానములకు విరుద్ధమైనవిగా బోధించుచుండిరి. అబద్ద బోధకులు యేసును వేరుగా బోధిస్తూ సువార్త పేరుతో తప్పుడు విధానములను బోధించిరి (2కొరింథి 11:4) ఇదేమి సూచిస్తుందంటే యేసును బోధించే ప్రతివారు దేవుడు నియమించిన బోధకుడు కాదని గ్రహించాలి. యేసు స్వయముగా ఇట్లా చెప్పెను. “ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును” (మత్తయి 7:21). గలతీ 1:6–9లో పౌలు ఈ విధముగా చెప్పెను. ఎవరైనను వేరే సువార్తను బోధించిన యెడల అట్టివారు తమ మీదికి శాపమును తెచ్చుకొందురు. అయితే కొరింథులోని కొందరు క్రైస్తవులు అటువంటి తప్పును అంగీకరించిన వారు కూడా ఉన్నారు.

అబద్ధ బోధకులను గూర్చి పౌలు ఇంకా చెబుతూ “వారు మోసము చేయు పనివారే, కాని క్రీస్తు యొక్క అపొస్తలులుగా వారిని వారు మార్చుకుంటున్నారు. (2కొరింథి 11:13) వారు మారు వేషము వేసుకొని వెలుగు దూతవలె సాతానుడు మారు వేషము వేసుకున్నట్లు వారు క్రీస్తు యొద్ద అపొస్తలులు గాను, నీతి పరిచారకులుగాను మారు వేషములో వారిని వారు పరిచయము చేసుకున్నారు. (2కొరింథి 11:14,15). క్రీస్తు యొక్క అపొస్తలులు గాను మరియు వారు నీతి పరిచారకులుగాను మారు వేషములో వారిని వారు పరిచయము చేసుకుంటున్నారు. (2కొరింథి 11:14,15) ఎంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నాము. కొందరు క్రీస్తు యొక్క పరిచారకులమని చెప్పుకొనుచు సాతాను ప్రతినిధులుగా పని చేస్తున్నారు. ఈ విషయంలో పౌలు తన చివరి అభిప్రాయమును చెప్పు, వారి క్రియల చొప్పున వారి అంతము వచ్చును (2కొరింథి 11:15). సంఘములలో చోటు చేసుకున్న తప్పును గూర్చి ఎంత కఠినముగా స్పందించాడో గమనించు.

**బుధవారం** **సెప్టెంబరు 16**

## సువార్త నిమిత్తమై శ్రమలను భరించుట

అబద్ధ బోధకులను సాతాను యొక్క ప్రతినిధులుగా పేర్కొనిన తరువాత (2కొరింథి 11:1–15) కొరింథీయుల ఆలోచన ప్రకారముగా “పౌలు అవివేకియైనట్లు వారు భావించినందున, వారు ఊహించినట్లు పౌలు కావాలని అవివేకివలె మాట్లాడుచున్నాడు

(2కొరింథి 11:16-21) ఆవిధంగా మాట్లాడుట వలన కొరింథీయులు, అవివేకులతో, అబద్ధ బోధకులతో మాట్లాడుట ఎంత బుద్ధిహీనతో వారు అర్ధము చేసుకున్నారు. కొరింథీయులు అవివేకులను ఉన్నతముగా ఎంచిన యెడల ఇప్పుడు పౌలు కూడా అవివేకముగా మాట్లాడుచున్నందున ఆయనను కూడా వారు ఉన్నతమైన వ్యక్తిగానే చూడాలి. సువార్త నిమిత్తము పౌలు శ్రమలను భరించెను గనుక ఆయనను ఒక విశ్వాసియైన క్రీస్తు సేవకుడు అని పిలువబడెను ((2కొరింథి 11:22,23).

**2కొరింథి 11:22-28 చదువుడి. ఇక్కడ పౌలు చెప్పుచున్న విషయమేమిటి?**

పౌలు యూదుడుగా జన్మించుట వలన ఒక విధముగా అబద్ధ బోధకులతో సంబంధమున్నట్లుగానే ఉండవచ్చును ((2కొరింథి 11:22) అయితే క్రీస్తు కొరకు ఆయన చేయుచున్న సేవ వారిని అధిగమించియున్నది ((2కొరింథి 11:23) వారు 'క్రీస్తు యొక్క సేవకులా' అని ఆయన అడుగుచున్నాడు. అందుకు జవాబుగా అట్లయిన యెడల నేను వారికన్నా చాలా ఎక్కువ అని చెప్పెను. ఆయన చేసిన సేవ ఎంతో ఎక్కువ. అందుకు ఫలితముగా ఆయన అనుభవించిన శ్రమలు కూడా ఎక్కువే. జైలులో బంధింపబడుట, తరచుగా ఆయనను కొరడాలతో కొట్టిరి.

అయితే ఇదంతా ఏమీ కాదు. పౌలు ఎదుర్కొనిన శ్రమలు ఇంకా ఉన్నాయి. ఒకటి తక్కువ ముప్పది తొమ్మిదిసార్లు కొట్టిరి. ఆవిధంగా 5సార్లు కొట్టిరి ((2కొరింథి 11:24) లాఠీలతో కొట్టిరి. రాళ్ళు విసిరి కొట్టిరి ఓడ బ్రద్దలై సముద్రములో ప్రమాదాలను ఎదుర్కొనెను ((2కొరింథి 11:25) ప్రయాణములలో ప్రమాదాలు వాటిల్లెను. నదులలో ప్రయాణించినపుడు ప్రమాదములు, బందిపోటు దొంగల నుండి ప్రమాదములు, జన్మభూమికి చెందిన జనులనుండి ప్రమాదములు, అన్యజనులనుండి ప్రమాదము, అబద్ధ విశ్వాసుల యొద్ద నుండి ప్రమాదము, జన సాంద్రత ఎక్కువగా ఉన్న పట్టణాలలో ప్రమాదాలు ((2కొరింథి 11:26) కష్టమైన పనులు చేయుట ద్వారా నష్టములు, నిద్రలేని రాత్రులు, ఆకలి బాధ, త్రాగుటకు నీరు లేని ఇబ్బందులు, భరించరాని చలి, వస్త్రహీనత ((2కొరింథి 11:27) ఇవి సరిపోనట్లు సంఘాల మీదున్న లోతైన ఆదుర్దా వలన విపరీతమైన మానసిక క్షోభ ఎదుర్కొనెను. ((2కొరింథి 11:28).

ఈ విధంగా కేవలం ఒక యదార్ధమైన క్రీస్తు యొక్క సేవకుడు మాత్రమే సువార్త కొరకు ఇన్ని శ్రమలు అనుభవించగలడు. అతిశయించవలసి వస్తే ఎన్నో చెప్పగలడు. అయితే అతిశయపడినది క్రీస్తు కొరకు ఆయన చేసిన దానిని బట్టి కాదు గాని, క్రీస్తు ఆయనకు ఏమి చేసెనో దానిని బట్టి అతిశయపడాలి. మానవుల బలహీనతలలో దేవుని శక్తి ఎక్కువుగా కన్పిస్తుందని పౌలుకు తెలుసు (2 కొరింథి 12:9,10) తన శరీరములో ఒక ముల్లు ఈయబడెను (2కొరింథి 12:7) పౌలు సాధించిన కార్యముల నిమిత్తము

అతిశయపడకుండా దేవుడు పౌలును కాపాడెను. వినయమును నేర్చుకున్న పౌలు తన బలహీనతలేమిటో తెలుసుకొని దేవుని కృప, దయ మీద ఆధారపడి శ్రమలన్నింటిని భరించి వినయ మనస్కుడుగ రూపాంతరము చెందెను.

**సువార్త పరిచర్య చేయుట వల్ల నీవు కూడా శ్రమలను ఎదుర్కొనుచున్నావా? నీ జీవితములో ఏమి నేర్చుకున్నావు? పౌలు ఏ రీతిగా తట్టుకున్నాడో తెలుసుకొని మీరు కూడా శ్రమలు తట్టుకొనుటకు అది మీకు ఎట్లు సహాయపడును?**

గురువారం సెప్టెంబరు 17

## మారుమనస్సు పొందని వారికి విజ్ఞప్తి

2కొరింథి 12:14–13:10లో పౌలు మూడవసారి కొరింథులో ఉన్న క్రైస్తవ సంఘమును దర్శించబోవుచున్నట్లు వారికితెలియపర్చెను (2కొరింథి 12:14; 2కొరింథి 13:1) అక్కడున్న అబద్ధ అపొస్తలులకన్నా ఆయన ఏవిధముగాను తక్కువవాడు కాదని ముందుగానే వారికి తెలియపర్చెను. అయితే ఇప్పుడు మరొకసారి ఎంతో విశ్వాసముతో వారి మధ్యకు వచ్చి, మారుమనస్సు పొందని సంఘసభ్యులతో మాట్లాడి వారిని సక్రమమైన మార్గములో నడిపించుటకు ప్రయత్నించెను. ఈసారి వారిని దర్శించుటలో ఇదే ప్రధానమైన లక్ష్యము. పౌలు ఏమి మాట్లాడిన ఏమి చేసిన అక్కడున్న క్రైస్తవ సంఘము ఆత్మ జ్ఞానముతోను నైతికముగాను ఎదగాలని తన ఆశయయైయుండెను (2కొరింథి 12:19).

**2కొరింథి 12:20,21 చదువుడి. కొరింథులో ఉన్న సంఘము యొక్క ఆత్మీయ ఎదుగుదలకు అడ్డుగా నిలిచి ఇబ్బందికర పరిస్థితులను సృష్టించుకున్న పాపములు ఏమిటి?**

2కొరింథి 12:20,21లో పేర్కొన్న పాపములు పౌలు వ్రాసిన ఇతర పత్రికలలోను ఇంచుమించుగా అవే పాపములు కనబడుచున్నవి (రోమా 1:29–31 గలతి 5:19–21) మొదటి రెండు విషయాలు 1కొరింథి 3:3లో కనిపించుచున్నవి. సంఘములో అసూయ మరియు కలహములున్నవి. పౌలు మూడవసారి సంఘమును దర్శించే నాటికి, పరిస్థితుల్లో తేడా లేకపోవచ్చునని అభిప్రాయపడ్డాడు. అందుకాయన ఈలాగు చెప్పెను. “ఒకవేళ నేను వచ్చునపుడు మీరు నాకు ఇష్టులుగా ఉండరేమో అనియు నేను మీకు ఇష్టుడుగా ఉండనేమోయని బాధపడెను” (2కొరింథి 12:20). అనగా దీని అర్థము. “మీ యెదుట నున్నపుడు మీలో అణకువగలవాడనైనట్లు, మీ యెదుట లేనప్పుడు ధైర్యము గలవాడనైనట్లు ఉందునేమో” (2కొరింథి 10:1) అన్నట్లు లేకుండా ఈసారి మీలో అవిధేయులైనవారిని నడిపించుటకు సిద్ధముగా ఉన్నాననే ఉద్దేశము ఇక్కడ పౌలు కనపర్చెను (2కొరింథి 10:6).

అపవిత్రతతోను లైంగికపరమైన అపవిత్రతతోను, ఇంద్రియ సుఖమును ఆశించుటచేతను కొంతమంది సభ్యులు జీవించుచుండగా అట్టి వారు మారుమనస్సు పొందకపోవచ్చును. వారినిమత్తమే పౌలు ఆవేదన చెందుచున్నను (2కొరింథి 12:21) ఇట్టి పాపములను బట్టియే సంఘములో విబేధాలు కలుగుచున్నవి.

తరువాత పాపములో ఉన్నవారు సంఘ నియమముల చొప్పున మారుమనస్సు పొంది సంఘ క్రమశిక్షణ ప్రకారము నడుచుకోవాలని పౌలు ఆశించాడు. (2కొరింథి 13:1–4). పాప జీవితములో కొనసాగుటకు అది మానవ బలహీనత అని ఏవో సాకులు వెదకుట కాదు గాని, అట్టివారు పాపమును విడిచి సన్మార్గములో నడుచుటకు దేవుని శక్తి అందుబాటులో ఉన్నది. ఆ శక్తిని ఉపయోగించుకొనువారు విజయవంతమైన జీవితాన్ని జీవిస్తారు (2కొరింథి 13:4) సంఘములో లైంగిక పాపములో జీవించేవారున్నారు. అట్టివారి దృష్టిలో దేవుని శక్తి నిజమైనది కాదని జీవించుటవలన ఆ శక్తిని ఉపయోగించుకొనుటకు ప్రయత్నించరు. వారు మారుమనస్సు పొంది ఆ శక్తిని అనుభవపూర్వకముగా పొందినపుడు ఆ శక్తి విధేయతలోకి నడిపిస్తుంది. సభ్యుల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకొనాలనే ఉద్దేశము పౌలుకు రాలేదు గాని వారిలో మారుమనస్సు రావాలి. మీరు తప్పు చేయకుండునట్లు, పరివర్తన రావాలనే ప్రార్థించెను (2కొరింథి 13:7–9). వారు విశ్వాసములో ఉన్నారో లేక లేరో అనే విషయాన్ని వారే స్వీయ పరీక్ష చేసుకోమని ఆయన కోరుచున్నాడు.

**2కొరింథి 13:5 చదువుడి. విశ్వాసములో కొనసాగుట అనగా అర్థమేమి? మీరు విశ్వాసములో ఉన్నారని మీకు ఎట్లు తెలుసు?**

**శుక్రవారం** **సెప్టెంబరు 18**

## అదనపు అధ్యయనం

ఎలెన్ జి వైట్, "ది ఎడ్వంట్ రివ్యూ అండ్ సబ్బాతు హెరాల్డు" సెప్టెంబరు 30, 1873 నుండి లవొదికియా సంఘము : పుట 125 చదువుడి.

"గత కాలములో చేసిన తప్పులు పొరపాట్లను మరల మరల చేయకుండా ప్రభువు తన ప్రజలను కావలి కాస్తున్నాడు. ఎల్లపుడు అబద్ధ బోధకులు తప్పులతో కూడిన సిద్ధాంతాలను బోధిస్తూ, అపవిత్రమైన విషయాలను ఆచరిస్తూ తప్పుడు నియమాలతో మోసకరమైన రీతిలో జీవిస్తూ ఉంటారు. ఈ కోవకు చెందిన వారు అనేకులు. చివరికి ఏర్పాటు చేసుకున్న వారు సహితము ఈ గుంపులో ఉన్నారు" ఎలెన్ జి వైట్, ది ఎడ్వంట్ రివ్యూ మరియు సబ్బాతు హెరాల్డు జనవరి 7, 1904

మన అభిప్రాయములు పరీక్ష పెట్టబడే విధముగా ప్రభువు ప్రణాళికలు వేస్తాడు. మనము విశ్వాసములో జీవిస్తున్నామా లేదా అని ప్రతి విషయమును పరీక్ష క్రిందికి తెచ్చును. సత్యమును నమ్ముచున్నామని చెప్పుకొనే అనేకులు సుఖ నిద్రలో ఉన్నారు. "నేను ధనికుడను, నాకేమియు కొదువులేదు. నాకు కావలసిన వస్తువులన్నీ ఉన్నవి" అని గర్విస్తారు –ఎలెన్ జి వైట్, గ్రంథకర్తలకు రచయితలకు హెచ్చరికలు, పుటలు 36.

''మనుష్యులు తప్పును పోషిస్తూ ఉండగా సత్యము స్పష్టముగా

తెలియజేయబడుతుంది. వారు అనుసరించే సిద్ధాంతములను దేవుని వాక్యము దగ్గరకు తీసుకొని సరిచూసినట్లయితే ఆ భావాలు సక్రమమైనవేనా? లేక అంధకార సంబంధమైనవా అని తెలిసిపోతుంది. ఆ సిద్ధాంతాలు దేవుని వాక్యానుసారముగా లేవని తెలిసినపుడు వారి తప్పు తెలుసుకొని, తప్పుడు విధానాలను అనుసరింపక చీకటిలో నుండి వెలుగులోనికి నడిపింపబడుదురు. అనేకమంది వారి అభిప్రాయములను సమర్ధించుకొనుటకు పరిశుద్ధ లేఖనముల మాటలను ఉపయోగించి వాటి అర్ధమును వారికి అనుకూలముగా వివరించుకుంటారు. ఆవిధముగా కొందరు వారిని వారు మోసపుచ్చుకొని, ఇతరులను కూడా మోసగించి దేవుని వాక్యమునకు దూరముగా నడిపిస్తారు. మనము దేవుని వాక్యమును అధ్యయనము చేయుట ఆరంభించినపుడు విరిగిన హృదయముతో ఆ పని చేయవలెను. సమస్త విధమైన స్వప్రయోజనము నూతనత్వమును ప్రేమించుట వంటి విషయాలను మన అనుదిన జీవితములనుండి తీసివేసుకోవాలి" -ఎలెన్ జి వైట్, గ్రంథకర్తలకు రచయితలకు హెచ్చరికలు పుటలు 36,37 .

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. 2కొరింథి 10:1-6 చదువుడి. దేవుని సత్యము కొరకు ఆత్మ సంబంధమైన యుద్ధమును ఎదుర్కొనుటకు పౌలు అనుసరించిన విధి విధానములేమిటి? మనము ఎదుర్కొనే ఆత్మ సంబంధమైన యుద్ధాలకు ఆ నియమాలను ఎట్లు అనుసరించాలి?
2. అంతము రాకముందు, అనేకమంది అబద్ధ బోధకులు వస్తారు. వచ్చి మనుష్యులను తప్పుడు త్రోవకు నడిపిస్తారు. మీ ప్రాంతీయ సంఘములోను కొందరుంటారు. వారి బారినుండి ఎట్లు తప్పించుకొనగలరు? సంఘ పరిచర్య విజయవంతమగుటకు వారిని ఏవిధముగా తప్పించగలము?
3. పౌలు చాలా శ్రమలను ఎదుర్కొన్నాడు. "ఎందువలన పౌలు అతిశయించెను? (2కొరింథి 11:16-33) ప్రభువునందు అతిశయించుట అనగానేమి?
4. సంఘ సభ్యులు నిజముగా విశ్వాసములో ఉన్నారా లేదా అని ఎందుకు స్వీయ పరీక్ష చేసుకోవాలి? (2కొరింథి 13:5).

❋✶❋